అభివృద్ధి పనులు ప్రారంభం

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో ప్రభుత్వ, ఎమ్మెల్సీ, మున్సిపల్ నిధులతో అభివృద్ధి పనులు చేపడతామని మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణితాశ్రీకాంత్‌గౌడ్ అన్నారు. సోమవారం 5వ వార్డులో రూ. 15 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు, ఎమ్మెల్సీ వాణీదేవి మంజూరు చేసిన మరో రూ. 20 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్ కొత్త సురేఖ భాస్కర్‌గౌడ్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. కమిషనర్ నాగమణి, కౌన్సిలర్లు నానునాయక్, కొత్త హేమలత శ్రీనివాస్‌గౌడ్, కో ఆప్షన్ సభ్యులు శాధూల్, విడియాల వినయ, నేతలు నర్సింహాగౌడ్, రాజుముదిరాజ్, శ్రీరాములు, ప్రభు, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారి

కీసర: అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్లపల్లి ఫైర్ స్టేషన్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం నాగారంలోని సెరినిటీ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించారు. విద్యార్థులకు జాగ్రత్తలపై చక్కటి అవగాహన కల్పించినందుకు పాఠశాల ముఖ్య కార్యదర్శి నోముల వసంత, కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి చర్లపల్లి ఫైర్ స్టేషన్ వారిని అభినందించారు.

'ప్రజావాణి'కి 120 ఫిర్యాదులు



సాక్షి, సిటీబ్యూరో: సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికార యంత్రాంగానికి 120 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ కలెక్టర్ సైదులు, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

26న యోగా శిక్షకుల పోస్టులకు ఇంటర్వ్యూలు



జంగయ్య,జిల్లా ఆయూష్ ఇన్‌చార్జ్

ఘట్‌కేసర్: ప్రజల ఆరోగ్య సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆయూష్ మిషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి రంగారెడ్డి పరిధిలో ఏర్పాటు చేసిన యోగా శిక్షణ కేంద్రాల్లో యోగా శిక్షణ ఇవ్వడానికి 45 ఏళ్ల లోపు ఔత్సాహిక మహిళ, పురుష శిక్షకుల ఎంపికకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు జిల్లా ఆయూష్ మిషన్ ఇన్‌చార్జ్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ జంగయ్య తెలిపారు. ఘట్‌కేసర్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ... సికింద్రాబాద్ పాస్‌పోర్ట్ కార్యాలయం వెనుక ఉన్న ఆయూష్ కమిషన్ కార్యలయంలో ఈ నెల 26న ఉదయం 10.30 గంటల నుంచి ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. శిక్షకులు ఇంటర్, యోగా ధ్రువ సర్టిఫికెట్లు కలిగి ఉండాలన్నారు. స్థానికుడై ఉండాలని, ఎస్ఎస్‌సీ, 6 నెలల యోగా సర్టిఫికెట్, కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండాలని, అనుభవ ధ్రువపత్రం ఉండాలన్నారు. అదనపు సమాచారం కోసం ఆయూష్.తెలంగాణ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

నేడు కుక్కలకు వ్యాక్సినేషన్

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మున్సిపాలిటీలోని పెంపుడు కుక్కలు, జంతువుల కోసం ప్రత్యేక వ్యాక్సినేషన్ (ఏఆర్‌వీ) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. బ్లూ క్రాస్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వ్యాక్సినేషన్ డ్రైవ్ ఉంటుందన్నారు. ప్రత్యేక వాక్సినేషన్ కార్యక్రమంలో ప్రజలు తమ పెంపుడు కుక్కలు, ఇతర జంతువులకు వాక్సినేషన్ చేయించాలని కోరారు.

చుట్టపుచూపుగా వచ్చి అనంత లోకాలకు..!

ఘట్‌కేసర్: బంధువల ఇంటికి చుట్టపు చూపుగా వచ్చిన ఓ వ్యక్తి మరణించిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అవుషాపూర్ కేపాల్‌లో నివసించే చత్తీస్‌ఘడ్‌కు చెందిన బిహారి లాల్ ఇంటికి అతడి కుమారుడు రోహిత్, బావమరిది సీతులాల్‌భారీహ(48)తో కలిసి చత్తీస్‌ఘడ్ నుంచి ఈ నెల 21న వచ్చారు. అదే రోజు రాత్రి భోజనం అనంతరం అందరూ నిద్రకు ఉపక్రమించారు. ఉదయం లేచి చూసే సరికి సీతు లాల్ భారీహ మరణించి ఉన్నాడు. దీంతో అందరు భయపడి ఇతరులకు చెప్పలేదు. సోమవారం వారు ఇంటి యజమాని నరసింహకు చెప్పగా అతడు పోలీసులు సమాచారం ఇచ్చాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతికి గల వివరాలు సేకరించారు. అనారోగ్యంతో మరణించినట్లు పోలీసులు భావిస్తున్నారు. బిహారి లాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కారు ఢీకొని గాయపడ్డ యువకుడి మృతి



రిజ్వాన్ అలీ (ఫైల్)

ఘట్‌కేసర్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ యువకుడు మరణించిన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సైదులు సమాచారం మేరకు... అవుషాపూర్‌లో నివాసముండే ఉత్తరప్రదేశ్‌కు చెందిన రిజ్వాన్ అలీ(23) సోమవారం ఉదయం 5 గంటలకు స్థానిక తీన్మార్ హోటల్ సమీపంలో వంతెన వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని కారు రిజ్వాన్ అలీని ఢీకొట్టింది. దీంతో అతడి తల బలమైన గాయమైంది. చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉదయం 10 గంటలకు మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాయితీపై ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు

దరఖాస్తులు ఆహ్వానిస్తున్న జిల్లా అధికార యంత్రాంగం

తెలంగాణ రాష్ట్ర ఆహార శుద్ధి సంస్థ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ అనుమతితో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ (పీఎంఎఫ్ఎంఈ) సీబిలో భాగంగా 35 శాతం రుణ రాయితీతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు రుణాల మంజూరు కోసం దరఖాస్తులను అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి ఆహ్వానిస్తున్నట్లు మేడ్చల్–మల్కాజిరి జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్, జిల్లా నోడల్ అధికారి ప్రశాంత్‌కుమార్ వెల్లడించారు. సాక్షి, సిటీబ్యూరో



● మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని రైతులు, మహిళలు, నిరుద్యోగ యువత, స్వయం సహాయ సంఘాల సభ్యులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సూక్ష్మ ఆహార పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామీణ యువతసహా ఎవరైనా ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

● అభ్యర్థులు తమ దరఖాస్తును పూర్తి వివరాలతో ఆధార్, పాన్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, విద్యుత్ బిల్లు, యూనిట్‌కు సంబంధించిన వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జిల్లా ఆహార శుద్ధి పరిశ్రమల డీఆర్‌పీఈ అమర్ సింగ్‌ను ఫోన్: 94934 38347లో సంప్రదించాలి.

అర్హతలు ఇవే...

దరఖాస్తుదారుల వయస్సు 18 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్, జిల్లా నోడల్ అధికారి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. దరఖాస్తుదారులు గతంలో ఏదైనా ప్రభుత్వ పథకం నుంచి రాయితీ పొంది ఉండకూడదన్నారు. ప్రాజెక్ట్ వ్యయంలో 35 శాతం వరకు రుణ అనుసంధాన రాయితీ (గరిష్ట రాయితీ పరిమితి రూ. 10 లక్షలు) ఉంటుందన్నారు. లబ్ధిదారుల వాటా కనీసం 10 శాతం ఉండాలని, మిగిలినది బ్యాంక్ నుంచి రుణం ఇస్తారని వివరించారు.

జిల్లా స్థాయి 'యువజన' ఉత్సవాలు

సాక్షి, సిటీబ్యూరో: యువతలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు తెలంగాణ ప్రభుత్వం యువజన సంబురాలకు శ్రీకారం చుట్టిందని జిల్లా యువజన, క్రీడల అధికారి జి.వి.గోపాల్‌రావు తెలిపారు. చదువుతో పాటు కళలు, కళా ప్రదర్శనలు, ఆటల్లో యువతకు ఈ నెల 27న మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణంలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలకు 15 నుంచి 29 సంవత్సరాల లోపు వయసు వారు మాత్రమే అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన యువతీయువకులు ఈ నెల 26వ తేదీలోగా కలెక్టరేట్ రెండో అంతస్తులోని జిల్లా యువజన క్రీడల కార్యాలయంలో వ్యక్తిగతంగా కలవచ్చన్నారు. వాట్సాప్ నంబర్: 76609 19518లో కూడా వివరాలతో కూడిన పేర్లను నమోదు చేసుకోవచ్చని వివరించారు.

● ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విజేతలను వచ్చే ఏడాది జనవరి 12 నుంచి 16 వరకు జాతీయ స్థాయిలో జరిగే వేడుకలకు పంపిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వాస్తవ్యులై ఉండాలని, ఆధార్ కార్డ్, 2 పాస్ ఫొటోలు తప్పని సరిగా ఉండాలన్నారు.

పోటీలు ఇవే...

1) జానపద నృత్య బృందం (సభ్యుల సంఖ్య 10కి మించ రాదు. ప్రదర్శనకు గరిష్ట కాలపరిమితి 15 నిమిషాలు).
2) జానపద పాటల బృందం (సభ్యుల సంఖ్య 10 మందికి మించరాదు. ప్రదర్శనకు గరిష్ట కాలపరిమితి 7 నిమిషాలు)
3) జానపద నృత్యం(వ్యక్తిగతం) (ఈ బృందంలో ఐదుగురికి మించరాదు. ప్రదర్శనకు గరిష్ట కాలపరిమితి 7 నిమిషాలు).
4) జానపద పాటలు (వ్యక్తిగతం) (అయిదుగురు సభ్యులకు మించరాదు. ప్రదర్శనకు గరిష్ట కాలపరిమితి 7 నిమిషాలు). నోట్: సినిమా పాటలు అనుమతించరు. వాయిద్య పరికరాలు అభ్యర్థులే తెచ్చుకోవాలి.
5) కవిత్వం (హిందీ/ఇంగ్లిష్) (మొత్తం 500 పదాలతో గంటలో (60 నిమిషాలు) పూర్తి చేయాలి)
6) వ్యాస రచన(హిందీ/ఇంగ్లిష్) (ఇందులో 1,000 పదాలతో 60 నిమిషాల్లో పూర్తి చేయాలి)
7) పెయింటింగ్ పెయింటింగ్ (ఏ3 సైజులో 90 నిమిషాల వ్యవధిలో పూర్తి చేయాలి. చిత్రలేఖనానికి సంబంధించిన శీర్షిక 20–30 పదాలు మించకూడదు. పెయింటింగ్ సామగ్రిని ఎవరికి వారే తెచ్చుకోవాలి)
8) ఉపన్యాసం(హిందీ/ఇంగ్లిష్) (ఎంపిక చేసిన అంశంపై హిందీ లేదా ఇంగ్లిష్ 3 నిమిషాలు మించకుండా మాట్లాడాలి)
9) యువతి (హస్తకళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తి) (హస్తకళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తి కేటగిరీల్లో తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శనకు తీసుకురావాలి) ఇందులో ఎంపిక చేసిన వారు రాష్ట్ర స్థాయికి అర్హత సాధిస్తారు.

అథ్లెటిక్స్ విజేత పద్మకు అభినందన



పద్మను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాధిక, వైస్ ప్రిన్సిపాల్ పద్మమ్మ

ఘట్‌కేసర్: తెలంగాణ సౌత్ జోన్ అథ్లెటిక్స్‌లో విజేతగా నిలిచిన అంకుషాపూర్‌లోని ఇబ్రహీంపట్నం సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థిని వి.పద్మను ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక, వైస్ ప్రిన్సిపాల్ జ్యోతి సోమవారం అభినందించారు. హైదరాబాద్‌లో ఈ నెల 19, 20వ తేదీల్లో తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్‌లో హెచ్‌పీసీ మొదటి సంవత్సరం విద్యార్థిని పద్మ 400 మీటర్ల పరుగు పందెంలో రెండో స్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో మూడో స్థానంలో నిలిచారు. ఆమెను విజయ పథంలో నడిపించిన ఫిజికల్ డైరెక్టర్ జ్యోతిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలి



సాక్షి, సిటీబ్యూరో: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలని మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు ఆర్యవైశ్య ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం 58 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములని మేడ్చల్ జిల్లా ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు బెలిదే రమేష్ గుప్తా కొనియాడారు. తెలుగు విశ్వవిద్యాలయానికి నామకరణం చేసిన పొట్టి శ్రీరాములు పేరును తొలగించాలని యోచించడం సరికాదన్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర మహాసభ పిలుపుమేరకు కలెక్టరేట్ ఎదుట అందోళనా కార్యక్రమాన్ని నిర్వహించి,కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. ఆర్యవైశ్య జిల్లా ప్రతినిధులు, నాయకులు బచ్చు నగేష్, బల్లి శ్రీనివాస్, పిసిరి ప్రకాష్,ఉప్పల శేఖర్, పెద్ది నాగరాజ్, చక్రపాణి, బల్లి శ్రీధర్, పసుపునూరి కేదార్, యాద్గార్పల్లి సంతోష్, జూలకంటి రమేష్, రవీందర్, చిరంజీవి, వాస కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో టీజీవో అసోసియేషన్ ప్రతినిధుల భేటీ



సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను నూతనంగా ఎన్నికైన జిల్లా టీజీవో అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో అధికారులు, ఉద్యోగులకు సంబంధించిన పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా అర్హులైన పేద ప్రజలకు సర్కారు పంపిణీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు వారి దరికి చేర్చేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కలెక్టర్ గౌతమ్‌ను కలిసిన వారిలో టీజీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, కార్యదర్శి, డాక్టర్ కురుమూర్తి, అసోసియేషన్ జిల్లా ఆఫీస్ బేరర్లు, కమిటీ సభ్యులు వెంకటేశం, విజయ కుమారి, డి.రవీందర్, ఎం.రఘునందన్ గౌడ్, విష్ణువర్ధన్‌రావు, అర్చన, ఆనందరావు, కరుణాకర్ రెడ్డి, రమేష్, సత్యనారాయణ, సాయికృష్ణా, నాగమణి, శంకరయ్య, శ్యామల, నాయుడు, స్వాతి, దాలి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా గణేష్ లడ్డూ వేలం

● రూ. 2.07 లక్షలు పలికిన లడ్డూ



లడ్డూతో ఈశ్వరయ్య కుటుంబసభ్యులు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి అత్వెల్లిలోని చత్రపతి శివాజీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద లడ్డూ వేలం పాట సందడిగా సాగింది. విగ్రహాన్ని ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా లంబోదరుడి చేతిలో ఉంచిన ప్రసాదం లడ్డూ వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మండల ఈశ్వరయ్య కుటుంబ సభ్యులు వేలంలో పాల్గొని రూ. 2.07 లక్షలకు లడ్డూను సొంతం చేసుకున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు

బోడుప్పల్: పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లో సోమవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా 13, 17 డివిజన్‌లలో నిర్వహించిన పారిశుద్ధ్య కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై రోడ్లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మేయర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ.. అపరిశుభ్ర ప్రాంతంలో బ్లీచింగ్ పౌడర్ చల్లి, నీటి నిల్వలు ఉన్న చోట ఆయిల్‌బాల్స్ వేసినట్లు వెల్లడించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమలను నివారించేందుకు చెత్త చెదారాన్ని రోడ్లపై, ఖాళీ స్థలాల్లో వేయకుండా స్వచ్ఛ ఆటోలకు అందించాలన్నారు.

మున్సిపల్ చైర్మన్‌కు సమస్యల ఏకరువు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో నెలకొన్ని సమస్యలను సంతోష్‌నగర్ కాలనీ నూతన కమిటీ సభ్యులు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డిని కలిశారు. తమ కాలనీలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి వివరాలను చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. సంతోష్‌నగర్ కాలనీ నూతన అధ్యక్షుడు హనుమంతరావు, ఉపాధ్యక్షులు రాంచందర్, కోశాధికారి లింగంచారి తదితరులు పాల్గొన్నారు.

మురికి కూపంగా ఆర్టీసీ డిపో



మురికి కూపంగా మారిన మేడ్చల్ బస్ డిపో ప్రాంగణం

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ ఆర్టీసీ డిపో డ్రైనేజీ నీటితో నిండి మురికి కూపంగా మారింది. డిపో ఆవరణలో ఉన్న డ్రైనేజీలు పొంగిపొర్లడంతో వాటి నుంచి మురికి నీరు బయటికి వెలువడుతూ బస్సులు ఆగే చోట, ఖాళీ ప్రదేశాలు మురికి నీటితో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడున్నారు. డిపోలో బస్సు ఎక్కే వరకు వేచి ఉండే ప్రయాణికులు ముక్కున వేలు వేసుకుని ఉండాల్సి వస్తుంది. డిపోలోకి వెళ్లాలంటే మురికి నీటిలోనే నడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. మురుగు నీటిలో పందుల స్వైర విహారం చేస్తున్నాయి. మురుగు సమస్యతో తాము అనారోగ్యానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంచాలని వినతి

ఘట్‌కేసర్: పట్టణంలోని కేఎల్లార్ నగర్ కాలనీలోని ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని 100 కేవీ నుంచి 160 కేవీకి పెంచాలని మాజీ వార్డు సభ్యుడు కొత్తకొండ వెంకటేష్, మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్ కోరారు. ఈ మేరకు పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్‌ను సోమవారం కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. లో ఓల్టేజీ కారణంతా విద్యుత్ సరఫరాలో తీవ్ర ఇబ్బందులు నెలకొంటున్నాయన్నారు. కాలనీకి సరఫరా చేసే లైన్ ఇండస్ట్రియల్ ఫీడర్ ఉన్నందున తరచు కోతలు విధిస్తున్నారన్నారు. కాలనీకి నేరుగా ఘట్‌కేసర్ ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా చేయాలని కోరారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి

● గుండ్లపోచంపల్లి మున్సిపల్ సమావేశం
● ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి



రోడ్డు ఏర్పాటుకు వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్



సమావేశంలో పాల్గొన్న ఎంపీ ఈటల, ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: రాష్ట్రంలోని మున్సిపాలిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్రమైన ప్రణాళికలు రూపొందించి, వాటికి నిధులు కేటాయించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం నిర్వహించిన గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ సాధారణ సమావేశంలో ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి పాల్గొన్నారు. మున్సిపల్ అభివృద్ధి, సమస్యలు, చేపట్టాల్సిన పనులు, నిధులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల్లో వర్షాలు వస్తే లోతట్టు ప్రాంతాలు జలమయం అవడం, డ్రైనేజీలు పొంగిపొర్లడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థ, నీటి సరఫరా వంటి అన్ని అంశాలపై ప్రభుత్వం దీర్ఘకాలిక పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలన్నారు.

రోడ్డు కోసం వినతి...

కొంపల్లి బ్రిడ్జి నుండి అయోధ్య చౌరస్తా మీదుగా గౌడవెల్లి రింగు రోడ్డు వరకు 100 ఫీట్ల రోడ్డు ఏర్పాటుకు కృషి చేయాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు ఎంపీ ఈటలకు వినతిపత్రం సమర్పించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో ఉన్నంత మంది విద్యార్థులు, విద్యా సంస్థలు ఎక్కడా ఉండకపోవచ్చని, పలు రంగాల అభివృద్ధి, ప్రజల అవసరాల దృష్ట్యా రోడ్డు వెడల్పు అవసరమని అందుకు రాష్ట్ర ఆర్‌అండ్‌బీ మంత్రికి నివేదించి రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో పాలకవర్గం పలు అభివృద్ధి పనులు, పండగల సందర్భంగా ఏర్పాట్లకయ్యే ఖర్చులు, సమీక్షలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో కమిషనర్ స్వామి, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'నిషా'చరులకు జరిమానా!

● 9 మందికి జరిమానా విధించిన న్యాయస్థానం
● ఒకరికి జరిమానాతోపాటు రెండు రోజుల ట్రాఫిక్ డ్యూటీ



ట్రాఫిక్ డ్యూటీ శిక్ష అనుభవిస్తున్న వాహనదారుడు

పోచారం: మూడు రోజులుగా ఘట్‌కేసర్ ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వ్యక్తులను గుర్తించి రంగారెడ్డి జిల్లా 1వ ప్రత్యేక మెట్రో పాలిటన్ న్యాయమూర్తి ముందు సోమవారం హాజరు పరిచారు. ఇలా పట్టుబడిన 9 మందికి ఒక్కొక్కరికి రూ. 2500 చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారు. వీరిలో ఒకరికి జరిమానాతో పాటు రెండు రోజులు ట్రాఫిక్ డ్యూటీ నిర్వహించాలని ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పందిరి పరుశురామ్ హెచ్చరించారు.

కబడ్డీలో సత్తాచాటిన విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న సెక్రటరీ, ప్రిన్సిపాల్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ కళాశాల విద్యార్థులు కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన నైపుణ్య 2024 క్రీడా పోటీలు మొయినాబాద్‌లో నిర్వహించారు. ఆ పోటీల్లో కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచి ట్రోఫీ కైవసం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గెలుపొందిన విద్యార్థులు, పీడీ రవీందర్, రత్నకుమార్‌లను కళాశాల సెక్రటరీ టి.వి.రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, డైరెక్టర్లు సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, పీఆర్వో రవిసుధాకర్ అభినందించారు.

వరద ముంపు సమస్య పరిష్కారానికి కృషి

● మేడ్చల్–మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



ముంపు కాలనీల్లో సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ ఈటల రాజేందర్

కీసర: నాగారం మున్సిపల్ పరధిలోని లోతట్టు కాలనీల్లో వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని మేడ్చల్–మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం నాగారం మున్సిపల్ పరిధిలో ఇటీవల కురిసిన వర్షాల వల్ల వరద ముంపునకు గురైన వివిధ కాలనీల్లో ఈటల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డితో కలిసి పర్యటించారు. వర్షాకాలంలో జవహర్‌నగర్, దమ్మాయిగూడ పరీవాహక ప్రాంతంలోని వరదనీరుతోపాటు, మురుగునీరు, చెత్త డంపింగ్ యార్డు నుంచి వెలువడే విష వ్యర్థాలు సైతం రాంపల్లి చౌరస్తాలోని ప్రధాన రహదారి మీదుగా తమ కాలనీల్లోని రహదారుల గుండా ప్రహిస్తాయని కాలనీవాసులు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను పరిష్కరించాలని అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోయారు. సమస్య పరిష్కారం కోసం ఎంపీ కోటా నుంచి నిధులు కేటాయించి సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. ఈ మేరకు మున్సిపల్ డీఈని పనులు చేపేట్టందుకు ఎన్ని నిధులు అవసరం అవుతాయో ఎస్టిమేషన్ వేయాలని ఎంపీ ఈటల రాజేందర్ ఆదేశించారు. బీజేపీ మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి, రాష్ట్ర నేత మల్లారెడ్డి, బీజేపీ నేతలు రవీందర్, కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.